క్లుప్తంగా

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గడివేముల: మండల పరిధిలోని దక్షిణకాశీగా పిలువబడే దుర్గాభోగేశ్వరాలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పంచ కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, దుర్గా అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరినాథ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు స్థానిక కాశీరెడ్డినాయన ఆశ్రమంలో ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు.

నేడు వెంకటప్ప స్వామి మహోత్సవం



తుంగభద్ర నదీ స్నానానికి స్వామి వారిని పల్లకీలో తీసుకెళ్తున్న వర్కూరు గ్రామస్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరులో వెలసిన వెంకటప్పస్వామి మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీలను చేసి ఆదివారం సాయంత్రం సి.బెళగల్ వద్ద ఉన్న తుంగభద్ర నది స్నానానికి గ్రామస్తులు పాదయాత్రగా తీసుకెళ్లారు. నదీస్నానం అనంతరం ఉత్సవ విగ్రహాన్ని సోమవారం సాయంత్రం తిరిగి గ్రామానికి తీసుకొస్తారు. గ్రామస్తులు ఎదురెళ్లి మేళతాళలాతో స్వాగతం పలికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు.


కోడుమూరు హంద్రీకి జీడీపీ నీరు విడుదల



వర్కూరు హంద్రీనదిలోకి చేరిన జీడీపీ నీరు

కోడుమూరు రూరల్ : వర్షాభావ పరిస్థితుల మూలంగా హంద్రీనది ఒట్టిపోయింది. దీంతో నదీతీర ప్రాంతాలైన కోడుమూరు, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల గ్రామాల్లో తీవ్ర మంచినీటి సమస్య తలెత్తింది. ఈ మేరకు నీటి సమస్య పరిష్కారం కోసం ఇరిగేషన్ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని 30క్యూసెక్కుల చొప్పున హంద్రీనదిలోకి రెండురోజులుగా విడుదల చేస్తున్నారు. విడుదలవుతున్న నీళ్లు ఆదివారం సాయంత్రానికి వర్కూరు హంద్రీనదిలోకి చేరాయి. మరో నాలుగైదు రోజుల పాటు నీటి ప్రవాహం ఇలాగే కొనసాగితే కోడుమూరు హంద్రీలోని మంచినీటి పథకాల వద్దకు చేరే అవకాశముంది.

కుందూలో వ్యక్తి గల్లంతు



వెంకటేశ్వర్లు

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (50) ఆదివారం కుందూ నదిలో గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన వెంకటేశ్వర్లు కాలు జారీ కుందూ నదిలో పడ్డారన్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున క్షణాల వ్యవధిలో కొట్టుకుపోయాడు. కళ్లమందే మునిగిపోయినట్లు బంధువులు తెలిపారు. కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదన్నారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వలంటీర్ల సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): విజయవాడలోని బసవపున్నయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించనున్న గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 వేల వేతనం ఇవ్వాలని, రాజీనామా చేసిన వలంటీర్లందరినీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతూ నిర్వహిస్తున్న సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వ్యవ'సాయం' ఏదీ ?

- నేటికీ పెట్టుబడి సాయం ఊసెత్తని టీడీపీ ప్రభుత్వం
- రైతుభరోసాను... అన్నదాత సుఖీభవా అంటూ పేరుమార్చిన వైనం
- రైతులు, కౌలు రైతులకు తప్పని ఆర్థిక ఇబ్బందులు



సోయాబీన్ పంటకు మందును పిచికారీ చేస్తున్న రైతు

గడివేముల: వర్షాభావ పరిస్థితులు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో సాగు కష్టంగా మారింది. అండగా నిలుస్తామన్న టీడీపీ ప్రభుత్వ పెద్దల నుంచి కనీస స్పందన లేదు. పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆ ఊసే ఎత్తడం లేదు. పీఎం కిసాన్ నిధులు మంజూరైనా టీడీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేయని తీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారింది. కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. కౌలు రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామన్న టీడీపీ హామీలు నీటి మూటలుగా మారాయి. బ్యాంకుల నుంచి ఆశించిన స్థాయిలో రుణాలు అందక పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నారు. కౌలుకి భూమి సాగు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) పొందలేక భూములు సాగు చేయలేని పరిస్థితుల్లో కౌలుదారులు కాలం వెళ్లదీస్తున్నారు. అదేవిధంగా మండలంలో కౌలుదారులకు గతేడాది సాగు చేసిన భూమికి అధికారులు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. వాస్తవానికి ఆ కౌలుదారుడు ప్రస్తుతం మరొక భూమిని సాగు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పరంగా అందే రాయితీలు సైతం కౌలురైతులు కోల్పోతున్నారు. గడివేముల మండలంలో 1,027 మందికి సీసీఆర్సీ కార్డులు అందాల్సి ఉండగా ఇప్పటి వరకు 935 మందికి అందజేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట సాగు హక్కు పత్రం కలిగిన కాలు రైతులకు ఏపీ పంట సాగు హక్కు చట్టం -2019ని సెక్షన్3(2),8(ఏ) ప్రకారం 11 నెలల కాలపరిమితికి రెండు పంటల సీజన్లకు సరిపడేలా ఈ కార్డులు అందజేస్తున్నారు. వీటినే క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ (సీసీఆర్‌సీ) కార్డులు అంటారు.

కౌలు రైతులకు అందని రాయితీలు

పంట రుణాలు, బీమా, విత్తనాలు, సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు కౌలురైతులకు సక్రమంగా అందడంలేదు. వివిధ కారణాలతో వాటికి దూరమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా సాయం ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీ ప్రభుత్వం రైతుభరోసా పేరును అన్నదాత సుఖీభవా అంటూ మార్చిందే తప్పా చేసిందేమీ లేదు. పెట్టుబడి సాయం ఏకంగా రూ. 20 వేలు అందజేస్తామని ఆర్భాటంగా హామీలు గుప్పించిన చంద్రబాబు ఇప్పటి వరకు మార్గదర్శకాలు ఖరారు చేయలేదు. అసలు తమకు వర్తింస్తుందా లేదా అనే అయోమయానికి గురవుతున్నారు కౌలురైతులు. రూ.లక్షలోపు తీసుకున్న పంట రుణాలకు సున్నా వడ్డీకే రుణం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించేది. తీసుకున్న రుణం ఏడాది లోపు తిరిగి చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ వర్తింపజేసింది. పంట రుణాలకు రైతు చెల్లిం చాల్సిన మూడు శాతం వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి రైతులకు సున్నా వడ్డీ అందించేంది. వ్వవసాయ రంగాన్ని టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు రైతుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

మూడెకరాలు కౌలుకు తీసుకున్నా



మూడెకరాలు కౌలుకు తీసుకుని మిరప సాగు చేస్తున్నా. ఒక్కో ఎకరానికి రూ.22 వేలు పెట్టుబడి పెట్టా. ఇటీవల వర్షాలు కురవక పోవడంతో పంట దెబ్బతినే పరిస్థితి ఉంది. మిరప మొక్కలు అక్కడక్కడ చనిపోతున్నాయి. ఈ పరిస్థితులు కొనసాగితే నష్టాలు తప్పవు. కౌలు రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. అన్ని రకాల రాయితీలు కౌలు రైతుకు అందించాలి.

– కుమ్మరి రాజు, కౌలు రైతు, గడివేముల

సీసీఆర్సీ తప్పనిసరి

ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ కార్డులు ఉంటే రైతుకి బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు అవకాశం. కార్డుల ద్వారా రైతులకు రాయితీలు అందుతాయి. ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో వేసిన పంటలు వాడువదుతున్నాయి. ప్రతి రైతు ఈ– పంట నమోదు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 935 కౌలు కార్డులు అందజేశాం. ఇంకా కార్డు పొందని కౌలు రైతులు వీఆర్వోలను సంప్రదించాలి. ఉచిత పంట బీమా పథకంపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయాల్సి ఉంది.

– హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

మండుతున్న కూరగాయల ధరలు



కూరగాయలు కిలో	ధర
వంకాయ	70
ఉల్లి	50
కాకర	60
బీరకాయ	50
క్యారెట్	60
బీన్స్	50
పచ్చిమిర్చి	40
దోసకాయ	60
బెండకాయ	50
టమోట	40

పాణ్యం: కొనలేం... తినలేం అన్నట్లుగా ఉంది ప్రస్తుత పరిస్థితి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. పప్పులు, నూనెల ధరలు పోటీపడుతున్నాయి. నిత్యావసర సరుకుల తోపాటు కూరగాయాల ధరలు మండుతున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ. 50 పైమాటే. దీంతో పేదలు విలవిలలాడుతున్నారు. ప్రతి ఆదివారం పాణ్యంలో నిర్వహించే సంతకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. వంటకు అతిముఖ్యమైన ఉల్లి సైతం కన్నీరు పెట్టుస్తుంది. మూడువారాలుగా పెరుగుతూ వచ్చిన ఉల్లి నేడు రూ. 50 వద్ద నిలిచిపోయింది. చివరకు వంకాయ సైతం ఏ మాత్రం అందనంటూ రూ. 70 ఎగబాకింది. బీరకాయ, కాకర సైతం పోటీ పడుతూనే ఉన్నాయి. రూ. 500 వందలు తీసుకెళ్లినా వారానికి సరిపడ కూరగాయలు రావడం లేదంటూ నిట్టూర్చుతున్నాడు సామాన్యుడు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామునాయక్

ఓర్వకల్లు: గృహ నిర్మాణ సంస్థల్లో అవుట్ సోర్స్, అప్రెంటీస్ ట్రైనీ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని షెడ్యూల్ ట్రైబ్ సంఘం (ఎస్టీఫ్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామునాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత 19 ఏళ్ల నుంచి గృహ నిర్మాణ సంస్థల్లో అవుట్ సోర్సింగ్, అప్రెంటీస్ ట్రైనీ విధానంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లుగాను, డేటాఎంట్రీ ఆపరేటర్లుగాను, ఎంబీసీలు, అటెండర్లుగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2,500 మంది పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎంతకాలం ఇలా కొనసాగాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను టైం స్కేల్ వర్కర్లుగాను, ఎస్ఎంఆర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం కార్యదర్శులు ఎస్ నాగరాజు, హనుమాన్‌నాయక్, లక్ష్మణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు న్యాయం చేస్తాం

కల్లూరు: ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చర్యలు తీసుకొని, అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం మండలంలోని దూపాడు గ్రామంలో ప్రభుత్వ భూమిని(139 సర్వేనంబర్) ఆమె పరిశీలించారు. దాదాపు ఇరవై ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని రైతులు ఎంపీకి విన్నవించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ భూ ఆక్రమణలపై విచారణ చేయించి సాగులో ఉన్న రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

- సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి



గడివేముల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

గడివేముల: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రం గడివేముల పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సీఐ తనిఖీ చేశారు. అదే సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులతో సీఐ మాట్లాడారు. సమస్యపై ఆరా తీసిన ఎస్ఐ బాధితులకు న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు. అనంతరం పెసరవాయి గ్రామంలో పికెట్‌ను తనిఖీ చేశారు. గ్రామంలోని పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలైన పెసరవాయి, మంచాలకట్ట, చిందుకూరు, దుర్వేశి గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందనే విషయాన్ని తెలుసుకుని మసలుకోవాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించమన్నారు. నాటుసారా, గుట్కా,పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు తలెత్తినప్పుడు పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అప్పటికీ సమ్మతి కానప్పుడు పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని, అధైర్యపడకుండా ఏ సమయంలోనైనా ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తారని భరోసా ఇచ్చారు. సీఐ వెంట ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

కొత్తూరులో శ్రావణమాస పూజలు



అభిషేకాలు చేస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిచారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారుజామున నుంచి భక్తులు తాకిడి పెరగడంతో గాలిగోపురం నుంచి క్యూలైన్‌లు ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనానికి 3గంటలకుపైగా సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. స్వామి వారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు

గండికోటకు కొనసాగుతున్న నీటి తరలింపు



గాలేరులో కాల్వ ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

పాణ్యం: జీఎన్ఎస్ఎస్(గాలేరు నగరి సుజల స్రవంతి)కాల్వ ద్వారా దిగువకు అధికారులు నీటిని తరలిస్తున్నారు. గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు కాల్వ ద్వారా 11వేల క్యూసెక్కులను గండికోటకు తరలిస్తున్నారు. వరద నీటి మేరకు శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు మీదుగా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు వదలి అక్కడి నుంచి గాలేరు ద్వారా అవుకు మీదుగా గండికోటకు తరలిస్తున్నారు. మరో పది రోజులు పాటు నీటిని తరలించే అవకాశం ఉందని సమాచారం. అలాగే ఆదివారం నాటికి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 12700క్యూసెక్కులు వస్తుండగా బైపాస్ ద్వారా 1300క్యూసెక్కులు, మిగిలిన నీటిని గోరుకల్లు జలాశయంలోకి వదలి ఆపై గాలేరు వదులుతున్నారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో 8.3టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్): ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యులు, కంటి వైద్యుడు డాక్టర్ జయప్రకాష్ చెప్పారు. బాలసాయి కంటి వైద్యశాల, సందీప్ క్లినిక్, లయన్స్ క్లబ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జంపాల శివయ్య నగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ.. శరీరంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న నేత్రాలను తరచూ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రంగనాయకులు, డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ పేదలకు వైద్య సదుపాయాలు అందించాలన్న ఉద్దేశంతో మురికి వాడల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలకు డయాబెటీస్, బీపీపై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ రాయపాటి శ్రీనివాస్, రాకేష్‌గౌడ్, డివి.చంద్ర, రాజశేఖర్‌గౌడ్, ఎ.రాజు, మౌలాలి, వెంకటేష్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: కోడుమూరు–ఎమ్మిగనూరు రోడ్డులో ఆదివారం బొలేరో వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గోనెగండ్ల మండలం వెముగోడుకు చెందిన మహబూబ్ బాషా, రవిప్రకాష్ పనినిమిత్తం బైక్‌పై కోడుమూరుకు వచ్చి తిరిగి గ్రామానికి బయలుదేరారు. ఇదే సమయంలో ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు వైపు వస్తున్న బొలేరో వాహనం వర్కూరు వద్ద బైక్‌ను వేగంగా ఢీకొని చెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో బైక్‌పై వస్తున్న మహబూబ్‌బాషా, రవిప్రకాష్‌లకు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంపై కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాగులో సస్యరక్షణే కీలకం

- ముమ్మరంగా వరినాట్లు
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



వరిమడిలో నాట్లు వేస్తున్న కూలీలు

గడివేముల: సాగులో సస్యరక్షణే కీలకం. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించొచ్చు. పంటలను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఏమరపాటు వహించినా నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. గడివేముల మండలంలో 20,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యం. ఇప్పటికే వివిధ పంటలు సాగు చేశారు రైతులు. కరిమద్దెల, పెసరవాయి, దుర్వేశి,చిందుకూరు, గడిగరేవుల, తిరుపాడు, మంచాలకట్ట, గడివేములలో వరి విస్తారంగా సాగు చేస్తారు. వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. 5 వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. వరి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ఏఓ హేమసుందర్‌రెడ్డి వివరించారు.

జింక్ లోపం... నివారణ..

జింక్ లోపం ఉన్న పంటలో 3 లేదా 4 ఆకులతో ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి ఆకు పెలుసుగా ఉంటుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

కాండతొలుచు పురుగు..

నారుమడి నుంచి పూతదశ వరకు వరిపంటకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వు చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీనివలన దిగుబడి బాగా తగ్గిపోతుంది. నివారణకు కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి తగినంత మోతాదులో పిచాకారీ చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకు ముడత...

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయడం వలన ఆకులు తెల్లబడతాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

సుడిదోమ..

సుడిదోమ వ్యాపిస్తే వరిపొలంలో దోమ ఉధృతి ఉన్న చోట పంట ఎండిపోతుంది. నివారణకు ట్రైసై క్లోజోల్ 0.6 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. గట్లపై కలుపు నివారించుకోవాలి.

ఆకుఎండు తెగులు నివారణ

బ్యాక్టీరియా వలన ఆకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కు సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి.

పొట్ట కుళ్లు తెగులు

వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. నివారించేందుకు కార్బెండజిమ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్టదశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారీ చేసుకోవాలి.

నీటియాజమాన్యం

పిలకలు వేసే దశలో, పైరు దుబ్బు వేయడం పూర్తయ్యేవరకు పొలంలో 2 సెంటీ మీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్టదశలో, పూత దశలో పొలంలో 5 సెంటీ మీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా చేపట్టాలి. నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్నపాటి మెలకువలు అనుసరించటం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. రైతులకు అవసరమైన ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి.

– హేమసుందర్‌రెడ్డి,ఏఓ,గడివేముల

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ఓర్వకల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యాక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. సమావేశానికి గైర్హాజరయిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

కల్లూరు: కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గడివేముల: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విద్యా సాగర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న వేదికను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.